నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
8 | నిజామాబాద్, గురువారం 27 ఫిబ్రవరి 2025 | NIZAMABAD



మద్దికుంట శ్రీ బుగ్గరామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

- భక్తిశ్రద్ధలతో శివరాత్రి వేడుకలు
- కిటకిటలాడిన శైవ క్షేత్రాలు
- మార్మోగిన ఓంకార నాదం





నిజామాబాద్‌లోని నీలకంఠేశ్వరాలయంలో లింగానికి క్షీరాభిషేకం చేస్తున్న భక్తులు

## హరహర మహాదేవ

ఉమ్మడి జిల్లాలో మహాశివరాత్రి పర్వదినాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. ప్రధాన శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు నిర్వహించారు. ఆలయాలన్నీ ఓంకార నాదంతో మార్మోగాయి. అర్ధరాత్రి లింగోద్భవం వేళ శివపార్వతుల కల్యాణోత్సవాన్ని అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టగా, పలు ఆలయాల్లో వారికోసం తాగునీరు, మజ్జిగ ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు చేపట్టారు. గురువారం శివాలయాల ప్రాంగణాల్లో అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

–సుభాష్‌నగర్, ఫిబ్రవరి 26

# టమాట రైతు కుదేలు

కోటగిరి, ఫిబ్రవరి 26:గిట్టుబాట ధర రాక టమాట రైతు కుదేలవుతున్నాడు. మార్కెట్‌లో ధర దక్కక టమాటలు తెంపకుండా పొలంలోనే వదిలేస్తున్నారు. నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం దేవునిగుట్ట తండా, నాగేంద్రపూర్ గ్రామాలకు చెందిన పలువురు రైతులు టమాట సాగు చేశారు. దిగుబడి బాగానే ఉన్నా మార్కెట్‌లో సరైన ధర పలుకడం లేదు. ప్రస్తుతం కిలో రూ.10 లోపే ఉండడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో పడిపోయారు. పంట కోసి మార్కెట్‌కు తీసుకెళ్తే వ్యాపారులు పెట్టెకు రూ.100 ఇస్తామంటున్నారని వాపోతున్నారు. టమాట తెంపడానికి వచ్చే కూలీల ఖర్చు కూడా రావడం లేదని దిగాలు చెందుతున్నారు. దేవునిగుట్ట తండాకు చెందిన ఫకీరా నాయక్ అర ఎకరంలో రూ.40 వేలు పెట్టుబడి పెట్టి టమాట సాగు చేశారు. పంట ఏపుగా కాసినా ధర లేకపోవడంతో ఆయన ఆందోళన చెందుతున్నాడు. రూ.40 వేలు పెట్టుబడి పెడితే రూ.900 ఆదాయం మాత్రమే వచ్చిందని ఫకీరా నాయక్ వాపోయారు. టమాట తెంపడానికి అయ్యే కూలి ఖర్చు కూడా రాకపోవడంతో తెంపకుండానే పొలంలో వదిలేసినట్లు తెలిపాడు. నాగేంద్రపూర్‌కు చెందిన రైతు చలపతి గిట్టుబాటు ధర రావడం లేదని టమాటను పొలం పక్కన పారబోశాడు.




ధర గిట్టుబాటు కావడం లేదని నాగేంద్రపూర్ సమీపంలో టమాటలు పారబోసిన రైతు

# తల్లిని చంపిన తనయుడు

### హత్య కేసులో రాజీ కాలేదని హతమార్చిన వైనం

### కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో ఘటన



సాబేరా బేగం (ఫైల్)

పెద్ద కొడప్‌గల్ (పిట్లం), ఫిబ్రవరి 26: హత్య కేసు విషయంలో రాజీ కాలేదని కన్నతల్లిని ఓ కుమారుడు హత్యచేశాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. స్థానిక ఎస్సై రాజు తెలిపిన వివరాల ప్రకారం.. పిట్లం మండల కేంద్రానికి చెందిన సాబేరా బేగం (60)కు నలుగురు కొడుకులు. 2021లో ఆమె రెండో కుమారుడు షాదుల్, మూడో కుమారుడు ముజీబ్ మధ్య ఆస్తి వివాదం తలెత్తగా.. ముజీబ్‌ను షాదుల్ కత్తితో పొడిచి చంపేశాడు. ఈ కేసు ప్రస్తుతం కోర్టులో ట్రయల్ నడుస్తున్నది. నిందితుడు షాదు ల్ తన తల్లి సాబేరా బేగంను కేసులో రాజీ కావాలని ఆమెను కోరగా అంగీకరించలేదు. దీంతో షాదు ల్ ఈ నెల 24న తల్లితో గొడవపడి ఆమె తలపై రోకలిదుడ్డుతో బాదాడు. తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం నిజామాబాద్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి పెద్ద కొడుకు అబ్దుల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.




# సర్వం సిద్ధం

## నేడు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్





కామారెడ్డి జిల్లాకేంద్రంలోని పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రంలో సిబ్బంది సందడి

- ఉదయం 8 నుంచి సాయంత్రం 4గంటల వరకు
- ఉమ్మడి జిల్లాలో ఏర్పాట్లు పూర్తిచేసిన యంత్రాంగం
- నిజామాబాద్‌లో 81, కామారెడ్డిలో 54 పోలింగ్ సెంటర్లు
- డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్లు
- పోలింగ్ కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రత

కంఠేశ్వర్/ కామారెడ్డి, ఫిబ్రవరి 26: నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్, మెదక్ ఉపాధ్యాయులు, పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాలకు నేడు పోలింగ్ జరగనున్నది. ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగనున్నది. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఈ నేపథ్యంలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లా కేంద్రాల్లో పోలింగ్ సామగ్రిని అధికారులు పంపిణీ చేశారు. నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, కామారెడ్డిలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ బుధవారం సందర్శించారు. ఎన్నికల సామగ్రి పంపిణీ తీరుతెన్నులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పోలింగ్ సిబ్బందితో పాటు ఓటింగ్ కేంద్రాల వద్ద బందోబస్తు నిర్వహించే పోలీసు సిబ్బందిని తరలించేందుకు సిద్ధంగా ఉంచిన ఆర్టీసీ బస్సులను పరిశీలించి, సకాలంలో నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు సిబ్బంది చేరుకునేలా పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. నిజామాబాద్, ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయాలతో పాటు బోధన్ సబ్‌కలెక్టర్ కార్యాలయ ఆవరణలో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేసి ఎన్నికల సిబ్బందికి అందించినట్లు కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగేలా అన్ని చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని తెలిపారు. ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పోలింగ్ కేంద్రాలకు అదనపు సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఓటు కలిగి ఉన్న వారు ఎలాంటి ప్రలోభాలకు గురి కాకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

### ఉత్కంఠగా మారిన పోరు

ఉమ్మడి కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ గ్రాడ్యుయేట్స్ నియోజకవర్గంలో పోరు ఉత్కంఠగా మారింది. బీజేపీ నుంచి అంజిరెడ్డి, కాంగ్రెస్ నుంచి నరేందర్‌రెడ్డి, బీఎస్పీ నుంచి ప్రసన్న హరికృష్ణ తదితరులు బరిలో నిలిచారు.



నిజామాబాద్‌లో పోలింగ్ సామగ్రి పంపిణీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

### నిజామాబాద్

#### ఉపాధ్యాయ ఓటర్ల వివరాలు

| డివిజన్ | మండలాలు | పోలింగ్ స్టేషన్లు | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | 10 | 10 | 1,054 | 947 | 2,001 |
| బోధన్ | 10 | 10 | 391 | 310 | 701 |
| ఆర్మూర్ | 13 | 13 | 731 | 318 | 1,049 |

#### పట్టభద్రుల వివరాలు

| డివిజన్ | మండలాలు | పోలింగ్ స్టేషన్లు | పురుషులు | మహిళలు | మొత్తం |
|---|---|---|---|---|---|
| నిజామాబాద్ | 10 | 21 | 8,816 | 5,525 | 14,341 |
| బోధన్ | 10 | 11 | 3,316 | 1,721 | 5,037 |
| ఆర్మూర్ | 13 | 16 | 7,861 | 4,335 | 12,196 |

### కామారెడ్డి

| | |
|---|---|
| మొత్తం పోలింగ్ కేంద్రాలు | 54 |
| పట్టభద్రుల కేంద్రాలు | 29 |
| పట్టభద్రులు | 16,410 |
| పురుషులు | 11,616 |
| స్త్రీలు | 4793 |
| థర్డ్ జెండర్ | 1 |
| ఉపాధ్యాయ కేంద్రాలు | 25 |
| ఉపాధ్యాయులు | 2011 |
| పురుషులు | 1308 |
| స్త్రీలు | 710 |



కామారెడ్డిలో పోలింగ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్



నస్రుల్లాబాద్ మండలం లింగంపల్లితండా గ్రామశివారులోని కాలువ వద్ద నిరసన తెలుపుతున్న రైతులు

### పంటలకు నీరందించాలని..

# రైతుల నిరసన

నస్రుల్లాబాద్ ఫిబ్రవరి 26: పంటలకు సాగునీరందక పోవడంతో బీర్కూర్, తిమ్మాపూర్, మల్లాపూ ర్ గ్రామాల రైతులు తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారు. వారం రోజుల నుంచి నిజాంసాగర్ ప్రధాన కాలువ నుంచి చెరువులు, పొలాలకు నీళ్లురాక పంట లు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. సాగునీరు అందించాలని కోరుతూ నస్రుల్లాబాద్ మండలం లింగంపల్లి తం డా గ్రామ శివారులోని 26వ డిస్ట్రిబ్యూటర్ కాలువ వద్ద బుధవారం రైతులు నిరసన తెలిపారు. అధికారులు వెంటనే స్పందించి సాగునీరు అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.